ప్రజాశక్తి
బుధవారం 10 జూలై 2024
5
అల్లూరి సీతారామరాజు



విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్ట పంచాయతీలో పరిధి ఎనిమిది ఎలిమెం టరీ స్కూల్లో సుమారు 340 మంది విద్యార్థిని విద్యార్థులకు దాతల సహకారంతో నోట్ బుక్స్ లు మంగళవారం సర్పంచ్ చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చిన్నబాబు మాట్లాడుతూ, పాఠశాలకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదని తెలిపారు. తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతు న్నారన్నారు .జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని పూర్తిస్థాయిలో నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఘు, పాంగి నానిబాబు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చిన్నబాబు

ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే.. గంజాయి నిర్మూలన

-విద్యా సంస్థలలో అవగాహనా క్లబ్బులు
- కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ప్రత్యామ్నాయ పంటల తోనే గంజాయి సాగు నిర్మూలన సాధ్యమని, తద్వారా యువత పెడత్రోవ పడకుండా చర్యలు చేపట్టవచ్చని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ మాట్లాడుతూ, గంజాయి సాగు చేస్తున్న రైతులను పోలీసు శాఖ ద్వారా గుర్తించినట్లు తెలిపారు. గంజాయితో నష్టాలు, సమస్యలను, ప్రత్యామ్నాయ పంటలతో కలిగే లాభాలను వివరించాలని సూచించారు. ముందుగా ఎస్‌పి తుహిన్ సిన్హా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మాట్లాడుతూ, గంజాయి సాగు చేసే వారిపై తీసుకుంటున్న చర్యలు, కేసుల వివరాలను, పరివర్తన ద్వారా వారిలో తీసుకు వచ్చిన మార్పులను కలెక్టర్ కు వివరించారు. పెదబయలు, చింతపల్లి, జి.మాడుగుల, జికె వీధి, అరకు, పాడేరు, హుకుంపేట తదితర తొమ్మిది మండలాలలో గంజాయి సాగు ప్రభావం ఉందని, గతంలో సుమారు 7,500 ఎకరాలలో పంట సాగు ఉండగా పోలీసు శాఖ ఏర్పాటు చేసిన పరివర్తన కార్యక్రమం ద్వారా వారిలో మార్పులు తీసుకు రావడం జరిగిందన్నారు. తద్వారా గత ఏడాది గంజాయి సాగు 1,039 ఎకరాలకు తగ్గిందన్నారు. గంజాయి సాగు రైతులపై కేసులు నమోదు చేయడం, ప్రత్యామ్నాయ పంటలవైపు మళ్లించు, ఇతర శిక్షణలతో సాగు విస్తీర్ణం అనుకోని విధంగా తగ్గిందన్నారు. కలెక్టర్ స్పందిస్తూ గంజాయి పంట పండించిన, రవాణా, విక్రయదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. పరివర్తన కార్యక్రమం ద్వారా మార్పు పొందిన వారి వివరాలు సేకరించి గ్రామ వారీగా గుర్తించి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా గంజాయి పండించే భూములను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ హక్కుల భూమిలో సాగు చేస్తే పట్టా రద్దు చేయడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు పటిష్టం చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖల అధికారులు గ్రామాల వారీగా గుర్తించి ప్రత్యామ్నాయ పంటల ఏర్పాటుకు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలన్నారు. డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలో గంజాయి నియంత్రణపై క్లబ్బులను ఏర్పాటు చేసి చర్చించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలన్నారు. ఆరోగ్య అక్షరాస్యత పై అవగాహన కల్పించాలని, డి-ఎడిక్షన్ కేంద్రాలు, మానసిక వికాస కేంద్రాల ద్వారా వినియోగదారులలో మార్పులు తీసుకు రావాలని సూచించారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ భావన వశిష్ట్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి వి.అభిషేక్, డిఎఫ్ఓ వినోద్ కుమార్ డిఆర్ఓ బి.పద్మావతి, ఎస్.ఇ.బి డిఎస్పి శ్రీనివాసరావు, డిఆర్డిఎ పిడి వి.మురళీ, డిఇఓ పి.బ్రహ్మాజీ, జిల్లా వ్యవసాయ, ఉద్యాన, శాఖల అధికారులు బి.ఎస్. నంద్, రమేష్ కుమార్‌రావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు, కాఫీ ఎడి అశోక్ పాల్గొన్నారు.

ప్రతి నెలా ఉద్యోగుల సమస్యల పరిష్కార వేదిక

పాడేరు: ఈ నెల నుండి ప్రతి నెలా ఆఖరి శుక్రవారం ఉద్యోగుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ప్రకటించారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని శాఖల ప్రధాన అధికారులకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ గ్రీవెన్స్ నెల చివరి శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు కలక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహిస్తామన్నారు.



బురదనీటిని చూపుతున్న గిరిజనులు

బురద నీరు తాగేదెలా..?

-గిరిజనుల ఆవేదన

ప్రజాశక్తి -అనంతగిరి: గ్రామంలో ఏర్పాటు చేసిన మోటారు బోరు కనెక్షన్ మరమ్మతుకు గురైందని, దీంతో కురుస్తున్న వర్షాల కారణంగా ఊట గెడ్డలో బురద నీరే దిక్కుగా మారిందని వెంగడ పంచాయతీ మెటవలస గ్రామ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గ్రామస్తులు మండల సిపిఎం నాయకులు దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం గ్రామాలను సందర్శించిన నాయకులు పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఊట పైపులైన్ నుంచి బురద నీరు సరఫరా అవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొండలరావు, రామన్నలు మాట్లాడుతూ, గ్రామంలో సంవత్సరం క్రితం ఏర్పాటు చేసిన బోరు మోటార్ కనెక్షన్ మరమ్మతు గురైందని, ఊట బావి నుండి తాగునీటి సరఫరా అవుతుందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కలుషితమైన బురద వస్తుందని, దీంతో రోగాలకు గురవుతున్నామన్నారు. అధికారులు స్పందించి మోటార్ కనెక్షన్ పనులు చేపట్టి తాగునీటి సరఫరా చేయాలని గ్రామస్తులు కోరారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపిటిసి సభ్యులు పూనం ప్రదీప్‌కుమార్

వరదలను ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు

ఎంపిటిసి ప్రదీప్‌కుమార్, సర్పంచ్ వెట్టి లక్ష్మి

ప్రజాశక్తి - వి.ఆర్.పురం

రాబోవు శబరి, గోదావరి వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని పెద్దమట్టపల్లి సర్పంచ్ వెట్టి లక్ష్మి, ఎంపిటిసి పూనం ప్రదీప్‌కుమార్ ధికారులకు సూచించారు. మండలంలోని పెద్దమట్టపల్లి పంచాయతీ పరిధిలోని గుర్రంపేట, పెద్దమట్టపల్లి గ్రామాల్లో మంగళవారం అధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో వరదలు వచ్చినప్పుడు ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు చాలా నష్టపోయారని గుర్తు చేశారు. ఈ ఏడాది తహశీల్దార్ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలపై గ్రామసభలు నిర్వహించడం అభినందనీయమన్నారు. చిన్నమట్టపల్లి, రామవరం, గుర్రంపేట, వెంకన్నగూడెం, కన్నాయిగూడెం, చింత రేగుపల్లి, పత్తిపాక, గ్రామాల్లో శబరి వల్ల ముందుగానే రహదారులు బంద్ అవుతాయని, వారికి నిత్యావసర సరుకులు, బియ్యం, కిరోసిన్, బరకాలు ముందుగానే అందించాలని కోరారు. పునరావాస కేంద్రాల్లో సోలార్ లైట్లు వేయించాలని, నాటు పడవలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. అలాగే గ్రామస్థాయి వరద సహాయక కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పలు సలహా సూచనలు ఇచ్చారు. ఈ గ్రామసభలో వీఆర్వోలు, వీఆర్ఏలు, సెక్రటరీలు, ప్రజలు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపడాలి

ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-హుకుంపేట: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగు పడాలని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ స్పష్టం చేశారు. మండలంలోని మజ్జివలస ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాల, జి.బొడ్డా పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠ్య ప్రణాళికలను అమలు చేయలేదని ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పై ప్రతేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. 10వ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రం పాఠ్యాంశాలను బోధించారు.పది తరువాత ఏమి చదువుతారని విద్యార్థులను ప్రశ్నించారు. ఏంపి సి, బైపైసీ గ్రూపుల గురించి అవగాహన కల్పించారు. ప్రతి ఆదివారం వేడినీటిలో విద్యార్థుల దుస్తులను ఉతికించాలని సూచించారు. చర్మవ్యాధులకు తగిన వైద్యం అందించాలని, మందులు సరఫరా చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ. కొండలరావు, ఏటిడబ్ల్యూ ఎల్.రజిని పాల్గొన్నారు.



విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న పిఒ



పనులు ప్రారంభిస్తున్న జెడ్‌పి ఛైర్‌పర్సన్ సుభద్ర

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ సెల్లుం గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణానికి ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో చాలా గ్రామాలకు తాగునీరు, రహదారుల సౌకర్యం కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు.ప్రజల కనీస అవసరాలు తీర్చడమే తన తొలి ప్రాధాన్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షులు పద్మారావు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ అరబీరు జగబంధు, వైసీపీ సీనియర్ నాయకులు సన్యాసి, జోలాపుట్ ఎంపీటీసీ కమల పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సిఐటియు నాయకులు అప్పలనాయుడు, కార్మికులు

నేటి కోర్కెల దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కొయ్యూరు

ఈ నెల 10న కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు వై.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని డౌనూరు పంచాయతీ తులబడ గ్రామంలో మంగళవారం భవన నిర్మాణ కార్మికులు, ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్‌లను బిజెపి ప్రభుత్వం అమలు చేయాలని చూస్తుందని, అవి అమలైతే కార్మిక చట్టాలు రద్దు కాబడతాయని చెప్పారు. దీనివల్ల కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, స్కీమ్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరోగ్య మిత్రలపై రాజకీయ ఒత్తుళ్లు మానుకోవాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు బకాయిలు వెంటనే చెల్లించాలని, ఏడాదికి రూ.200 పని దినాలు కల్పించాలని, రోజు వేతనం రూ.600 ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు టి.చిట్టిబాబు, నర్సింగరావు, పిలుపు, బాలయ్య, జాషువా, కిమ్మెలి చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.


ఉద్యానవన మొక్కల పెంపకానికి సహకారం

ప్రజాశక్తి-కొయ్యూరు : ఉద్యానవన మొక్కల పెంపకానికి ఉపాధి హామీ పథకం ద్వారా సహకారం అందిస్తున్నట్లు ఎంపీడీవో లాలం సీతయ్య తెలిపారు. ఉపాధి హామీ పథకం ఏపీవో రాజుతో కలిసి ఉపాధి పథకం ఈసీ, సీవో, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను చైతన్యవంతం చేసి ఉద్యానవన మొక్కల పెంపకం పనులను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు ఎకరానికి 110 యాసిడ్ నిమ్మ మొక్కలను పంపిణీ చేయడం జరుగుతుందని చెప్పారు. ఉపాధి హామీ పథకం ద్వారా రెండేళ్ల పాటు మొక్కల పెంపకానికి సహకారం అందుతుందన్నారు. అంతేకాకుండా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేస్తే ప్రోత్సాహాలు అందిస్తామని చెప్పారు. గిరిజన రైతులు ఉపాధి హామీ పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

ప్రశాంత్‌కుమార్‌కు వీడ్కోలు సన్మానం

ప్రజాశక్తి -సీలేరు

సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో ఎస్ఈ సివిల్ కెకెవి.ప్రశాంత్ కుమార్ విజయవాడ విద్యుత్ సౌద హెడ్ క్వార్టర్‌కు బదిలీ అయిన నేపథ్యంలో మంగళవారం సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్లు ఆధ్వర్యంలో బదిలీ వీడ్కోలు సన్మానసభ స్థానిక కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఏపీ జెన్కో ఈఈ ప్రభాకర్, ఏఈ సురేష్, ఏఈ పావని, కార్మిక సంఘ నాయకులు వై.సత్తిబాబు, వై.ధర్రాజు, శివ పసాద్, భవానీశంకర్, యస్.నాగేశ్వరరావు, ఆఫీస్ స్టాఫ్ ఇవివి.సత్యనారాయణ, జోగారావు, అప్పలనాయుడు, కార్మికులు ప్రశాంత్‌కుమార్‌ను ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా మోతుగూడెం ఓ అండ్ డ్యామ్ ఎస్ఇ చిన్న కామేశ్వరరావు, ఈఈలు ప్రభాకర్, బాలకృష్ణ మాట్లాడితూ ప్రశాంత్ కుమార్ మృధుస్వభావి అని, ఆయన రెండున్నర సంవత్సరాల పాటు ఇక్కడ పనిచేశారని, ఎటువంటి వివాదాలకు తావు లేకుండా అందరి మన్ననలు పొందుతూ ఉద్యోగ బాధ్యత నిర్వర్తించారని కొనియాడారు. స్థానిక ప్రజలతో సత్సంబంధాలు పెట్టుకొని సమస్యలను సున్నితంగా పరిష్కరించడానికి కృషి చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఇంజనీర్లు, జెన్కో ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



ప్రశాంత్ కుమార్‌ను సత్కరిస్తున్న ఏపి జెన్కో ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు



మాట్లాడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు

రహదారి నిధులు స్వాహా

- జెడ్‌పిటిసి గంగరాజు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో రోడ్డు సౌకర్యం ఏర్పాటుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసినప్పటికి సరైన రోడ్డు లేయకుండా కోట్ల రూపాయల నిధులను అధికారులు, కాంట్రాక్టర్లు స్వాహాకు పాల్పడ్డారని సిపిఎం జెడ్పిటిసి దీసరి. గంగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిన్నకోట, పెద్దకోట, బొర్రా, టోకురు తదితర పంచాయతీ పరిధి గ్రామాల్లో కోట్లాది రూపాయలతో రహదారి సౌకర్యాలు నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ పనులను పూర్తి చేయకుండా తప్పుడు రికార్డులు సృష్టించి అధికారులు, కాంట్రాక్లర్లు స్వాహాకు పాల్పడాలన్నారు.దీనిపై జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫ్రియా చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు గిరిజన శాఖ మంత్రి పర్యటన

ప్రజాశక్తి-పాడేరు: స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ నెల పదవ తేదీన జిల్లాలో పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. ఆమె పదవ తేదీ బుధవారం ఉదయం 6.30 గంటలకు సాలురులో బయలుదేరి రోడ్డు మార్గం ద్వారా ఉదయం 11గంటలకు పాడేరు చేరుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన జిల్లా అధికారుల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటలకు పాడేరు ఐటిడిఎ గెస్ట్ హౌస్‌లో టిడిపి నాయకులతో సమావేశమవుతారు. అనంతరం సాయంత్రం. 4 గంటలకు పాడేరు నుండి విశాఖపట్నంకు బయలుదేరి వెళతారు.

కేందుగూడ పాఠశాలను పరిశీలించిన ఎంఇఒ

'ప్రజాశక్తి' కథనంపై కలెక్టర్‌కు నివేదిక

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు : పిల్లల చదువు కోసం పాట్లు పేరుతో ప్రజాశక్తిలో వచ్చిన కథనంపై ఎంఇఒ కృష్ణమూర్తి స్పందించారు. ఈ మేరకు మండల పరిధిలో కుమడ పంచాయతీ కేందుగూడ గ్రామంలో పాఠశాలను సందర్శించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. కెందుగూడ గ్రామంలో పివిటిజి సామాజిక తెగకు చెందిన 42 కుటుంబాలు నివసిస్తున్నారు. వీరిలో 31 మంది పిల్లలు ఈ విద్యా సంవత్సరంలో చదువుతున్నారు. వీరిలో బాలికలు 19, బాలురు 12 మంది చిన్నారులు విద్యానభ్యసిస్తున్నారు. ఈ పాఠశాలకు ఇద్దరు ఉపాధ్యాయులు, ఒక మాతృభాష వాలంటరీ ఉన్నారు. ప్రతిరోజు వీరు పాఠశాలకు హాజరవుతున్నారు. ఈ పాఠశాలకు భవనం లేదని, గ్రామస్తులు తాత్కాలికంగా రేకుల షెడ్డు నిర్మించారని,, అందులోనే తరగతులు నిర్వహిస్తున్నామని మండల విద్యాశాఖ అధికారి ప్రకటనలో పేర్కొన్నారు.

11న సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-చింతపల్లి: విద్యాసంస్థల బంద్ కారణంగా వాయిదా పడిన సప్లిమెంటరీ ద్వితీయ సెమ్ డిగ్రీ పరీక్షలను ఈ నెల 11 నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యురాలు ఎం విజయ భారతి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, ఈ నెల 4న జరగవలసిన డిగ్రీ కళాశాల ద్వితీయ సెమ్ సప్లిమెంటరీ పరీక్షలు బిఎస్సీకి సంబంధించి పిజిక్స్, జూవాలజీ, బిఏకి సంబంధించి ట్రావెల్ మెనేజ్మెంట్, టూరిజం, బికాంకు సంబంధించి బిజినెస్ ఎకనామిక్స్ పరిక్షలు బంద్ కారణంగా వాయిదా వేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షలను ఈనెల 11న నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. ఆమెతో కళాశాల అధ్యాపకురాలు లీలా పావని పాల్గొన్నారు.

శిథిలావస్థలో సర్కారు బడులు

పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

ప్రజాశక్తి-కూనవరం

మండలంలోని సర్కారు బడులు పట్ల ఇటు ప్రభుత్వం, అటు విద్యాశాఖ అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. ఎప్పుడో కట్టిన భవనాలు శిథిలమై కారిపోతున్నా, స్లాబ్ పెచ్చులూడి పడుతున్నా పట్టించుకొనే నాథుడే లేరు. మరో వైపు ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు లేకపోవడంతో పిల్లలు ప్రైవేటు స్కూళ్ల వైపు మొగ్గ చూపుతుండడంతో విద్యార్థులు లేక పాఠశాలలు మూతపడుతున్న స్థితి నెలకొంది.

మండలంలోని కొండాయి గూడెం ప్రాథమిక పాఠశాల భవనం శిథిలమై నాలుగు సంవత్సరాలుగా వర్షం పడితే కారిపోతుంది. వర్షా కాలంలో పిల్లలు తడిసి ముద్దవుతున్నారు. కొత్త భవనం నిర్మాణం చేయాలని విద్యార్థులు, వారి తల్లి తండ్రులు రోడ్లపైకి వచ్చి రాస్తారోకోలు చేశారు. అనేక సార్లు అధికారులకు వనితిపత్రాలు ఇచ్చారు. అయినా నేటికీ ఆ పాఠశాల పరిస్థితి ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న మాదిరిగా వుంది. భవన మరమ్మతులుగాని, కొత్త భవనం నిర్మాణంగాని చేపట్టలేదు. దీంతో ఈ ఏడాది కూడా వర్షా కాలంలో ఈ పాఠశాల పిల్లలకు అవస్థలు తప్పేలా లేవు.

మండలంలోని బండారిగూడెం పాఠశాల భవనం కూడా శిథిలావస్థకు చేరింది. మంగళవారం భవనం స్లాబ్ పెచ్చులూడి కింద పడ్డాయి. ఆ సమయంలో ఆ ప్రాంతంలో కాకుండా పక్కన విద్యార్థులు ఉండడంతో వారికి ఏ హానీ జరగలేదు. అయితే శిథిలమైన భవనం నుండి తమ పిల్లలకు ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వంలో నాడు -నేడు పథకం కింద పలు పాఠశాలల్లో భవనాల మరమ్మతులు, కొత్త భవనాలు నిర్మాణం జరిగాయి. కాని కొండాయి గూడెం, బండారి గూడెం పాఠశాలలకు నాడు-నేడు నిధులు మంజూరు చేయలేదు. వీటిని ఏ ఒక్క అధికారీ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరో వైపు గొమ్ము అయ్యవారిగూడెం పాఠశాల విద్యార్థులు లేక ఈ ఏడాది మూతపడింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు, చొరవ తీసుకొని మన్యంలోని పాఠశాలలను బాగు చేస్తే ప్రభుత్వ పాఠశాలకు పంపేందుకు తల్లితండ్రులు ఆసక్తి చూపుతారని పలువురు చెబుతున్నారు.



బండారిగూడెం పాఠశాల భవనం స్లాబ్ పెచ్చులూడిన దృశ్యం

పోలవరం నిర్వాసితులకు పట్టిసీమ తరహా పరిహారం చెల్లించాలి

సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్

ప్రజాశక్తి-చింతూరు

పోలవరం ఇందిరా సాగర్ ప్రాజెక్ట్ వల్ల సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం పట్టిసీమ ప్రాజెక్టు నిర్వాసితులకు ఇచ్చిన విధంగా చెల్లించాలని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సురేష్ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం చెల్లించడంలో ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు ప్రారంభమైన ఈ 20 ఏళ్ల నుండి ప్రభుత్వాలు ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరతగతిన పూర్తి చేస్తామంటూ చెబుతున్నాయి తప్పా సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం, పునరావాసం పట్ల శ్రద్ధ పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి పట్టిసీమ నిర్వాసితులకు పరిహారం ఎకరాకు ఆనాడు రూ.20 లక్షలు చెల్లించారని గుర్తు చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారంగా పోలవరం నిర్వాసితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పునరావాస కాలనీలకు నిర్వాసితులు తరలించే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులందరికీ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితులకు పరిహారంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకువచ్చి నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు పల్లపు వెంకట్, మండల నాయకులు పోడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, సవలం నారాయణ, బాడిస శేషు, దిలీప్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్



గోతులను పూడ్చుతున్న ఎంపిటిసి సభ్యులు

శ్రమదానంతో రోడ్డు పనులు

ప్రజాశక్తి - చింతపల్లి : ఎంపీ నిధులతో చేపడుతున్న కొండవంచుల నుండి చినబరడ మీదుగా చిత్రాల గొప్పు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎర్ర బొమ్మల ఎంపీటీసీ సభ్యుడు సెగ్గే సత్తిబాబు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, తమ పంచాయతీలోని కొండవంచుల గ్రామం నుండి చినబరడ మీదుగా చిత్రాల గొప్పు రహదారిని ఎంపీ గ్రాంట్ నుండి 80 లక్షలతో పనులు చేపడుతున్నారన్నారు.ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో కొంతమేరకు రహదారి కోతకు గురైందన్నారు.

డిమాండ్స్ డేను జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు:బిజెపి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేసేందుకు పూనుకుంటోందని, వీటిని అడ్డుకట్ట వేసేందుకు ఈ నెల10న దేశవ్యాప్తంగా తలపెట్టిన కోర్కెల దినాన్ని విజయవంతం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కొర్ర శంకర్రావు కార్మికులకు మంగళవారం పిలుపునిచ్చారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలు అమలు చేయాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను తొలగించరాదని, ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు.అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్‌తో కార్మిక వర్గం తీవ్ర శ్రమదోపిడీకి గురవుతుందని తెలిపారు. ఆటో, ముఠా, తోపుడు బండ్ల కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని కోరారు.

అపోలో ఆసుపత్రి వద్ద మృతుని కుటుంబీకుల ఆందోళన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలోని అపోలో ఆసుపత్రి వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. చికిత్స కోసం చేరిన బాలుడు మృతి చెందాడు. పెండింగ్ బిల్లు చెల్లించి మృతదేహం తీసుకెళ్లాలని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడంతో మృతుని కుటుంబ సభ్యులు, స్థానికులు ఆందోళనకు దిగారు. కుమారుని పోగొట్టుకున్న బాధలో తాము ఉన్నామని, ఎటువంటి చెల్లింపులు చేయలేమని కుటుంబ సభ్యులు భీష్మించుకొని కూర్చున్నారు. దీంతో ఆసుపత్రి వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు వచ్చి ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడారు.

ఆరిలోవ బాలాజీనగర్‌కు చెందిన నిఖిల్ వెంకటసాయి కొన్ని రోజుల క్రితం జ్వరంతో ఫిట్స్ వచ్చి అపోలో ఆసుపత్రిలో చేరాడు. ప్రారంభంలో దఫదఫాలుగా రూ.3.65 లక్షలు అడ్వాన్సుగా చెల్లించారు. దీంతో పాటు బాలునికి ఉన్న ఇన్స్యూరెన్స్ రూ.7 లక్షలను ఆసుపత్రి యాజమాన్యం క్లైమ్ చేసుకుంది. బాలుడు మృతి చెందడంతో మొత్తం బిల్లు రూ.22 లక్షలు అయిందని, మిగతా 12 లక్షలు చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్లాలని ఆసుపత్రి యాజమాన్యం చెప్పింది. కుమారుని పోగొట్టుకున్న బాధలో ఉన్నామని, వైద్య ఖర్చుల నిమిత్తం దాతలు ఇచ్చినవి, తమ దగ్గర ఉన్నవి అన్నీ ఇప్పటికే పెద్ద మొత్తంలో చెల్లించామని, తమ దగ్గర ఇంకా ఏమీ లేవని వేడుకున్నారు. అయినా ఆసుపత్రి యాజమాన్యం అంగీకరించకపోవడంతో మృతుని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. స్థానిక మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, బుడుమూరు గోవిందరావు, పోలారావు, గాడి సత్యం, ముగడ రాజారావు, మజ్జి రమణి, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన చేపట్టారు. దీంతో ఆసుపత్రి యాజమాన్యం ఏమీచేయలేక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఉచిత ఇసుక పాలసీపై అభినందనలు

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొన్ను దొర



మాట్లాడుతున్న దొన్నుదొర

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసి విధానం తీసుకు రావడంతో సామాన్య ప్రజలను పెద్ద ఊరట లభించిందని టీడీపి అరుకు నియోజకవర్గ ఇన్చార్జి సివేరి దొన్నుదొర అన్నారు. మంగళవారం అరకులోయ తన నివాస గృహంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాట తప్పకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక పాలసీని తీసుకురావడం అభినందనీయమన్నారు.నెల రోజుల లోపే ఉచిత ఇసుక పాలసీని తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు.వైపీసీ ప్రభుత్వం ఇసుకపై సరైన విధానం అవలంబించక పోవడంతో ఆ పార్టీ నాయకులు మాఫియగా తయారయ్యారని పేర్కొన్నారు. గతంలో చిన్న చిన్న ఇల్లులు కట్టుకోవడానికి ఇసుక కొనుక్కోవాలంటే ఆర్థిక భారంగా ఉండేదన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి అరకులోయ మండల అధ్యక్షులు శెట్టి బాబురావు, పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, పద్మాపురం మాజీ సర్పంచ్ మహదేవ్, మాజీ ఎంపిటిసి కుమార్, ఉప సర్పంచ్ పాడి చందు, ఎంపిటిసి భీమరాజు, నాయకులు రాజు, సహదేవ్, లైకొన్, రాము పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు చేరవేద్దాం



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్

చింతపల్లి సర్పంచ్ పుష్పలత

ప్రజాశక్తి - చింతపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలకు చేరువ చేసేందుకు ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులతో కలిసి సమిష్టిగా పని చేద్దామని చింతపల్లి సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, పంచాయతీ పరిధిలోని గ్రామాలకు కనీస మౌలిక సదుపాయాలైన వీధి దీపాలు, తాగునీరు, సిమెంట్ రహదారుల నిర్మాణానికి సంబంధించి పాలక మండలితో చర్చించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు చిందాడ జయలక్ష్మి, తెదేపా జిల్లా కార్యనిర్వహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, పంచాయతీ కార్యదర్శి కోరాబు శివకుమార్, ఉప సర్పంచ్ నూర్ బాబు, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి, పంచాయతీ పాలకమండలి సభ్యులు, తెదేపా జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించండి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: చెత్తా చెదారాన్ని చెత్త బుట్టలో వేసి వాటిని దూరంగా పారబోసి పరిశుభ్రతను ప్రతి ఒక్కరు పాటించాలని కొర్రాయి పంచాయతీలో సర్పంచ్ పి.కొములు చెప్పారు. సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైనేజ్ పరిశుభ్రతం, రోడ్డు ఇరువైపులా జంగిల్ కటింగ్ చేయాలని తీర్మానించారు. రాబోయే రోజుల్లో జలజీవన్ మిషన్ ద్వారా మంచి నీరు ప్రతి గ్రామంలో అందించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ పంచాడి లలిత, వైస్ సర్పంచ్ జగన్నాథం, వార్డు సభ్యులు, జిల్లా నాయకులు కోనేడి లక్ష్మణ్, టీడీపీ నాయకులు కొర్రా నాగరాజు పాల్గొన్నారు



చెత్త బుట్టలను అందిస్తున్న సర్పంచ్ కోములు

'పని చేయని టీచర్లు తప్పకోండి'

ప్రజాశక్తి- అనంతగిరి:విద్యార్థులకు కనీస విద్యా బోధన నేర్పించని ఉపాధ్యాయులు తప్పుకోవాలని స్థానిక సర్పంచ్ సోమ్మెల రూతు డిమాండ్ చేశారు. మంగళవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అనంతగిరి పంచాయతీ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది పనితీరు దిగజారి పోతుందని, విద్యార్థులకు కనీసం అక్షరాలు చెప్పని పరిస్థితిలో ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే విద్యాభివృద్ధి కుంటుపడుతుందని ఆమె స్పష్టం చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజవర్గం పరిధి అల్లిపురం గాంధీ బొమ్మ సమీపంలోని ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్న బలివాడ నాగేశ్వరరావు (56) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మూడేళ్లగా అదే ఇంటిలో ఆయన అద్దెకి ఉంటూ, పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. అతిగా మద్యం సేవించే అలవాటు ఉంది. ఆయనపై భార్య పద్మ 2008లో ఫోర్త్ టౌన్ స్టేషన్‌లో వరకట్న వేధింపులు కేసు పెట్టింది. వీరికి కుమారుడు మణికంఠ సాయి ఉన్నాడు. భార్య పద్మ కుమారునితో కలిపి మర్రిపాలెంలో వేరేగా ఉంటోంది. చాలా కాలం నుంచి భార్యాభర్తలు విడివిడిగానే ఉంటున్నారు. నాగేశ్వరరావు అనుమానాస్పదంగా మరణించిన ఇంటి పక్కనే అతని బావ గొట్టిపెల్లి అరుణ్ కుమార్ అద్దెకు ఉంటున్నాడు. చెడు వాసన రావడంతో అరుణ్ కుమార్ వెళ్లిచూడగా మంచంపై నాగేశ్వరరావు చనిపోయి కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు అక్కడకు చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

నూతన గుంటపాలెంలో చోరీ

ప్రజాశక్తి -కశింకోట : మండలంలోని నూతన గుంటపాలెం గ్రామంలోని పలు ఇళ్లలో సోమవారం రాత్రి దొంగలు పడ్డారు. ఒక ఇంట్లో బంగారం, నగదు అపహరించుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... నూతనగుంటపాలెంలో పిల్లి సుందరరావు చెందిన ఇంట్లోకి సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తలుపులను పగలగొట్టి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులతో విశాఖపట్నం వెళ్లిన సుందరరావు మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి ఇల్లు మొత్తం చిందరవందరగా ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా, తులమున్నర బంగారు ఆభరణం, రూ.20వేలు నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీనిపై స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వినోద్ బాబు, ఎస్సై రమేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్ టీం ద్వారా వెనుముద్రలు సేకరించారు. అలాగే గ్రామంలోని కోరుకొండ మారయ్య, కలిగట్ల మహాలక్ష్మి నాయుడు, చిక్కాల రమణ, కళ్ళం గౌరమ్మ వరలక్ష్మి, చిక్కాల రమణమ్మ, అగ్రహారం శ్రీనివాసరావు తదితరుల ఇళ్లల్లోకి కూడా గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. అయితే వారి ఇళ్లలో ఏమీ చోరీకి గురికాలేదని సంబంధిత బాధితులు తెలిపారు. సిఐ వినోద్ బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లారస్ బస్సు ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మండలం లాలం కొత్తూరు వద్ద సోమవారం రాత్రి లారస్ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... జిల్లాలోని కోటవురట్ల మండలం కొడవటిపూడి గ్రామానికి చెందిన తండ్రి దొరబాబు, కొడుకు రాజేష్ (27) సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై విశాఖపట్నం వెళ్తున్నారు. కశింకోట మండలం లాలం కొత్తూరు వద్దకు వచ్చేసరికి వెనుక నుండి వస్తున్న లారస్ కంపెనీ బస్సు వారిని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన రాజేష్, దొరబాబు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే 108 వాహనాన్ని రప్పించి క్షతగాత్రులను అనకాపల్లి ఎన్‌టిఆర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించి కెజిహెచ్‌లో రాజేష్ మృతి చెందాడు. ఆయన తండ్రి దొరబాబు పరిస్థితి బాగానే ఉంది. తండ్రి దొరబాబు ఇచ్చిన పిర్యాదు మేరకు కశింకోట ఎస్ఐ రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడు రాజేష్ సాఫ్ట్ వేరు ఉద్యోగిగా పని చేస్తున్నాడు.

అప్పన్న సన్నిధిలో యలమంచిలి ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సింహాచలం : సింహాద్రి అప్పన్నను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి ఆనంద్‌కుమార్ సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు. వారిని ఆలయ అధికారులు సాలువతో సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని అందించారు. వారితోపాటు దేవస్థానం ఈఈ రాంబాబు, కనకరాజు, హరిరాజు, జనసేన నాయకులు మజ్జి సూరిబాబు, మజ్జి శ్రీను తదితరులు స్వామిని దర్శించిన వారిలో ఉన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ కమలమ్మ

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సీలేరు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుమ్మిరేవుల సర్పంచ్ ముర్ల కమలమ్మ అన్నారు. జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయితీలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. కమలమ్మ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో ముందుగా పంచాయతీ జమా ఖర్చులను కార్యదర్శి వి.శ్రీనివాస్ చదివి వినిపించారు. అనంతరం సర్పంచ్ కమలమ్మ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రతి ఒక్కరు ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. మారుమూల గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్, స్ప్రేయింగ్ వంటి చర్యలు చేపడతామని తెలిపారు. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు మంచినీరు, రహదారుల సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకొచ్చారు. నేలజర్త గ్రామంలో మంచినీటి కుళాయి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని వాటిని పూర్తి చేసే మంచినీటి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కోరారు. కొండజడ్డ గ్రామంలో నూతనంగా పాఠశాల మంజూరు, పరమశింగవరం రహదారి తదితర సమస్యలను తెలియజేశారు. గ్రామసభలో వచ్చిన సమస్యలపై చర్చించి తమ పరిధిలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని, తమ పరిధిలో లేని అంశాలను అధికారుల దృష్టి తీసుకువెళ్తామని సర్పంచ్ కమలమ్మ, కార్యదర్శి శ్రీనివాస్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు వ్యవసాయ పనిముట్లు సిద్ధం

ప్రజాశక్తి - కొయ్యూరు : ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో మన్యంలో గిరిజన రైతులు వ్యవసాయ పరికరాలను సిద్ధం చేసుకుంటున్నారు. మన్యంలో జరుగుతున్న వారపు సంతల్లో రైతులు తమ వద్ద ఉన్న పనిముట్లను తీసుకొచ్చి బాగు చేయించుకుంటున్నారు. పాడైపోయిన కత్తులు, గొడ్డళ్లు, గునపాలు, పారలు తదితర వ్యవసాయ పనిముట్లకు పదును పెట్టి, సరిచేయిస్తున్నారు. రాజేంద్రపాలెం, పెదవలస తదితర సంతల్లో కమ్మరం పని దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులలో నిమగ్నమయ్యారు.

అంగన్వాడీలకు నియామక పత్రాలు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని భీమవరం అంగన్వాడీ కేంద్రంలో నూతనంగా నియామకమైన మినీ అంగన్వాడీ కార్యకర్తకు, మర్రిపాలెం, దొడ్డవరం అంగన్వాడీ కేంద్రాల్లో నియమితులైన అంగన్వాడీ ఆయాలకు ఎంపిపి బడుగు రమేష్, ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో విజయ కుమారి మంగళవారం నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ అంగన్వాడీలు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని, లబ్ధిదారులకు, చిన్నారులకు మంచి సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయలసీమ కింగ్స్ సంబరాలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జూన్ 30 నుంచి విశాఖలో జరుగుతున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్‌లో సోమవారం బెజవాడ టైగర్స్‌పై విజయంతో రాయలసీమ కింగ్స్ లీగ్ దశను ముగించిందని జట్టు కెప్టెన్ గిరిధర్ రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం బీచ్ రోడ్‌లోని వారు బస చేసిన అంబిక సీ గ్రీన్ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో టీం యజమాని దశరథ రామి రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెప్టెన్ మాట్లాడుతూ ఎపిఎల్ -2024లో లీగ్ దశను రాయలసీమ కింగ్స్ విజయంతో ఘనంగా ముగించినట్టు తెలిపారు. సోమవారం జరిగిన ఆఖరి లీగ్‌లో బెజవాడ టైగర్స్‌పై గెలిచిందని వెల్లడించారు. దీంతో లీగ్‌లో తిరిగి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరుకుందని అన్నారు. ఇప్పటి వరకు జరిగిన లీగ్ దశలో బ్యాటింగ్‌లో ప్రశాంత్‌కుమార్, రోషన్, గుత్తా రోహిత్, వంశీకృష్ణ, వినయ్‌కుమార్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని, అదేవిధంగా బౌలింగ్‌లో రాయలసీమ కింగ్స్ తరపున షేక్ కమ్రుద్దీన్ 4, వినయ్‌కుమార్ 2, అంజనేయులు.2, వికెట్లతోను రాణించారని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

11న ఉమ్మడి విశాఖలో సిఎం బిజీబిజీ

పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పరిశీలన
ఎపి మెడిటెక్ జోన్‌లో సిఐఐ సమావేశానికి హాజరు
పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో బిజీబిజీగా గడపనున్నారు. ఈ మేరకు ఆయన టూర్ షెడ్యూల్ ఖరారైంది. చంద్రబాబు తన పర్యటనలో భాగంగా ఉదయం 10 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 11.10 గంటలకు అనకాపల్లి జిల్లాలోని దార్లపూడి చేరుకుంటారు. అక్కడి నుంచి 11.15 గంటలకు పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌కు బయలుదేరి వెళతారు. అనంతరం 11.20 నుంచి 11.50 వరకు పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌ను పరిశీలిస్తారు. మరలా 11.55 గంటలకు బయలుదేరి దార్లపూడి చేరుకొని అక్కడి నుండి ప్రత్యేక హెలికాప్టర్‌లో 12.05కి బయలుదేరి 12.35 గంటలకు విజయనగరం జిల్లా భోగాపురం వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఎయిర్ పోర్ట్‌కు చేరుకొని 1.30 వరకూ ఆ ప్రాంతాన్ని, ఆ పరిసరాలను ఏరియల్ వ్యూ ద్వారా సమీక్షిస్తారు. అనంతరం 1.35కి అక్కడి నుంచి బయలుదేరి 2.00 గంటలకు విశాఖపట్నం జిల్లాలోని ఎపి మెడిటెక్ జోన్‌కు చేరుకుంటారు. భోజన విరామం అనంతరం 2.30 నుంచి 4.30 వరకు ఎపి మెడిటెక్ జోన్‌లో ఏర్పాటు చేసిన సిఐఐ సమావేశంతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. మరలా 4.35కి అక్కడి నుంచి బయలుదేరి 4.45కి విశాఖపట్నం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. 4.50 నుంచి 6 గంటల వరకు ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొంటారు. అనంతరం 6.10 గంటలకు విశాఖపట్నం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 7.10 గంటలకు విజయవాడ ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి
- హోం మంత్రి అనిత

ఎంవిపి.కాలనీ, అనకాపల్లి, ఎస్.రాయవరం : సిఎం చంద్రబాబు పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత విశాఖ, అనకాపల్లి జిల్లాల అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం అనంతరం తొలిసారిగా చంద్రబాబు విశాఖకు విచ్చేస్తున్నారని, ఆయన పర్యటన ఏర్పాట్లలో ఎక్కడా ఎటువంటి లోటుపాట్లూ ఉండరాదని స్పష్టం చేశారు. కొందరు అధికారుల్లో నిర్లిప్తత ధోరణి కనిపిస్తోందని, దాన్ని విడనాడి సొంత కార్యక్రమంలా భావించి పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సిఎం సన్నాహక ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం మెడ్‌టెక్ జోన్ సమావేశ మందిరంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంకబ్రత భాగ్చి, జాయింట్ పోలీస్ కమిషనర్ డాక్టర్ కె.ఫక్కీరప్ప, జివిఎంసి కమిషనర్ సిఎం.సాయికాంత్‌వర్మలతో కలిసి జిల్లా అధికారులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు.

తొలుత అనిత ఎస్.రాయవరం మండలం దార్లపూడి సమీపంలో పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాయిల్‌ను పరిశీలించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్‌పి కెవి.మురళీకృష్ణ, యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయ్ కుమార్, ఎఎస్‌పి విజయ భాస్కర్, అనకాపల్లి ఆర్‌డిఒ చిన్నికృష్ణ, నర్సీపట్నం ఆర్‌డిఒ జయరాం పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడవట్లేదు


కేంద్ర సహకారంతో సమస్యను పరిష్కరిస్తాం
ఎపిలో దెబ్బతిన్న ఆర్థిక రంగాన్ని నిలబెడతాం
రైల్వే జోన్‌కు స్థలాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తాం
- విశాఖ ఎంపీ శ్రీభరత్ వెల్లడి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పూర్తి స్థాయి సామర్థ్యంతో నడవడం లేదు. అప్పుల్లో కూరుకుపోయింది. సుమారు రూ.20 వేల కోట్ల మేర అప్పులున్నాయి, రోజు వారీగా నడపాలన్నా డబ్బుల్లేవు. ప్లాంట్ విస్తరణ సమయంలో జరిగిన ఖర్చు ఇబ్బంది వైపు నడిపిస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపైనే దీని భవిష్యత్ ఆధారపడి ఉంది. కేంద్ర సహకారంతో స్టీల్‌ప్లాంట్ సమస్యను టిడిపి కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుంది. సెయిల్‌లో విలీనం చేయాలన్న అంశాన్ని పరిశీలిస్తున్నాం' - అని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ వెల్లడించారు. విశాఖ టిడిపి కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, దక్షిణ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్‌లతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రాష్ట్రంలో తమ ప్రభుత్వం అనుసరించే విధానంపై మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌పై తాను లిఖిత పూర్వక హామీ గతంలో ఇచ్చానని, అందుకనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేసి ప్లాంట్‌ను కాపాడతామని, అయితే తాము ఒక్కరమే లేమని, కూటమిలో భాగంగా ఉన్నామని, కూటమి కేంద్రంలో ఉందని గుర్తుచేశారు.

రైల్వే జోన్‌పై ఏమన్నారంటే..

రైల్వే జోన్ విశాఖలో ఏర్పాటు కోసం గత ప్రభుత్వం సరైన స్థలం ఇవ్వలేదని తాము స్థలాన్ని అందించే ప్రయత్నం చేస్తామని అన్నారు.



మాట్లాడుతున్న విశాఖ ఎంపీ శ్రీభరత్

వైజాగ్ స్టేషన్ అభివృద్ధికి మోడీ గతంలో వర్చువల్‌గా రూ.600 కోట్లతో పనులు ప్రారంభించారని, వీటికి బిడ్డింగ్ దశ పూర్తయిందని అన్నారు. గత ప్రభుత్వం అన్ని రంగాలనూ దెబ్బతీసిందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టాన్ని తాము పూడ్చుతామన్నారు. ఇసుకను దోపిడీ చేసి 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులను గత ప్రభుత్వం ఇబ్బంది పెట్టిందన్నారు. ఐదేళ్లుగా చతికిల బడ్డ అన్ని వ్యవస్థలకు కూటమి ప్రభుత్వ ఏర్పాటుతో పూర్వ వైభవం రానుందన్నారు. అలాగే రాష్ట్రంలో భవన నిర్మాణ కార్మికులకు మంచి రోజులొచ్చాయన్నారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం 40 వేల టన్నుల ఇసుకను అమ్మేసుకుని రూ.వేల కోట్లు దోచుకుందన్నారు. 4390 జీవోతో తమ ప్రభుత్వం ఇసుకను ఉచితంగా ఇస్తోందన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 15 రోజులకే మెగా డిఎస్సీ ఇచ్చిందన్నారు. పెంచిన పింఛనుతో పాటు రూ.7 వేలును అందించిందని తెలిపారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ సరోజిని, సిపిఎం నాయకులు

సిసి రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రేఖపల్లి పంచాయతీలో వడ్డి సత్యనారాయణ ఇంటి దగ్గర నుండి అంగన్వాడీ కేంద్రం వరకు రూ.7.50 లక్షలతో నిర్మాణం చేస్తు సిసి రోడ్డు పనులను స్థానిక సర్పంచ్ పూనం సరోజినీ, సిపిఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ మార్గంలో ప్రజలు, అంగన్వాడీకి వెళ్లే పిల్లలు నడవటానికి చాలా ఇబ్బంది పడేవారని, వర్షం పడితే బురదగా ఉండేదని తెలిపారు. ప్రజల ఇబ్బందులను గమనించి అధికారులతో మాట్లాడి సిసి రోడ్డు మంజూరు చేయించినట్లు చెప్పారు. సిమెంట్ రోడ్డును నాణ్యతతో సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పంకు, సత్తిబాబు, వార్డు మెంబర్లు, సచివాలయం ఇంజనీరింగ్ తరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

కొండను బైక్ ఢీకొని యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి మండలం సున్నంపాడు గ్రామ సమీపాన దూదిపూడి జంక్షన్ వద్ద బైక్ అదుపుతప్పి కొండను ఢీ కొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. గుర్తేడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... రంపచోడవరం మండలం గాంధీ నగరం గ్రామానికి చెందిన వీక చంటిదొర (33), మరో ఇద్దరు ద్విచక్ర వాహనంపై వారు నివాసముంటున్న మారేడుమిల్లి గ్రామానికి రంపచోడవరం నుండి సోమవారం రాత్రి బయలుదేరారు. సుమారు రాత్రి 10 గంటల సమయంలో సున్నంపాడు గ్రామ సమీపాన దూదిపూడి జంక్షన్ వద్ద భారీ మలుపులో బైకు అదుపుతప్పి కొండను ఢీకొట్టింది. దీంతో చంటిదొర ప్రమాద స్థలంలోనే దుర్మరణం చెందాడు. మిగతా ఇద్దరూ ప్రాణాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న గుర్తేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని చంటిదొర మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. గుర్తేడు ఎస్సై సాయికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మారేడుమిల్లి, గాంధీనగరంలో విషాదం

చంటిదొర మృతితో ఆయన స్వగ్రామం గాంధీనగరం, ఆయన నివాసముంటున్న మారేడుమిల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. చంటిదొరకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. చంటి ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా ఉండే వారిని, స్నేహితులు, బంధువులు చంటి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం

- ప్రాణాలతో బయటపడిన రాజవొమ్మంగి వాసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు స్థానిక కరెంట్ ఆఫీస్ సమీపంలో మంగళవారం ఓ భారీ వృక్షం జాతీయ రహదారికి అడ్డుగా నేలకూలింది. ఆ సమయంలో రాజవొమ్మంగి గ్రామానికి చెందిన ఇద్దరు చిన్న పిల్లలతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వాహనదారుడుపై విరిగి చెట్టు కొమ్మలు పడ్డాయి. ఇది గమనించిన స్థానికులు చెట్టుకొమ్మలు తొలగించి ముగ్గురిని బయటకు తీయడంతో ప్రాణాప్రాయం నుండి వారు బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న స్థానిక సీఐ సన్యాసినాయుడు తమ సిబ్బందితో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని రహదారికి అడ్డుగా నేల కూలిన చెట్టును ప్రొక్లెయినర్ సహాయంతో తొలగించారు. జాతీయ రహదారికి ఆనుకొని ప్రమాదభరితంగా ఉన్న చెట్లును తక్షణమే తొలగించాలని హైవే సిబ్బందికి సిఐ సన్యాసిరావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రాము, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.



కూలిన చెట్టు